
వన్నెపూడి ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న వరదనీరు


కాలువల్లో నీటి ప్రవాహానికి ఆటంకంగా మారిన చెత్త


గొల్లప్రోలులో శివాలయం వీధిని ముంచెత్తిన వరద నీరు


చెల్లలుదిబ్బ రామకోవెల వీధిలో ఇలా..

వర్షాలతో గొల్లుప్రోలు!

- గొల్లప్రోలు మండలం, నగర పంచాయతీని ముంచెత్తిన వరద నీరు
- నీట మునిగిన పొలాలు

పిఠాపురం: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయు గుండం ప్రభావంతో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాలకు గొల్లప్రోలు మండలం, గొల్లప్రోలు నగర పంచాయతీలను వరద నీరు ముంచెత్తింది. గ్రామాల్లో వీధులు నీట మునిగాయి. రోడ్లు, వీధులు చెరువులుగా మారడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంట పొలల్లోకి భారీగా వరదనీరు చేరి పొలాలు మునిగిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లోతట్టు ప్రాంతాలు నీట మునగడంతో స్థానిక ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితులు నెలకొన్నాయి. గొల్లప్రోలు మండలం వన్నెపూడి రహదారిపై నీరు ఉధృతంగా ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో ప్రజలు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తెరిపివ్వని వాన

కొత్తపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయు గుండం, తుపాను ప్రభావంతో మండల వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. శనివారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకూ ఎడతెరిపి లేకుండా వర్షం పడుతూనే ఉంది. పల్లపు ప్రాంతాలు, రోడ్లు జలమయమయ్యాయి. రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రహదారులపై గోతుల్లో నీరు నిలిచిపోవడంతో ప్రమాదకరంగా మారాయి. పిఠాపురం-ఉప్పాడ, కొత్తపల్లి-గోర్స, మూలపేట-నాగులపల్లి, యండపల్లి-రమణక్కపేట రోడ్లలో వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఆయా మార్గాల్లో ప్రమాదకరంగా ఉన్న గోతులను పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.


గొల్లప్రోలులో పొంగి పొర్లుతున్న పంట కాలువ

కుండపోత వర్షం

- తుపాను ప్రభావంతో
- రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు
- రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయం

పెద్దాపురం: తుఫాన్ ప్రభావంతో రెండు రోజులుగా కుండపోత వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. పెద్దాపురం పట్టణ, గ్రామాల్లోని వీధుల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. శనివారం వేకువ జామున నుంచి ఏకదాటిగా గంటల తరబడి కురిసిన కుండపోత వర్షానికి పట్టణ ప్రాంతంలోని మురికివాడలు జలమయ్యాయి. రోడ్లన్నీ వర్షపు నీటితో ఏరులై పారడంతో కాలువలోని మురుగు రోడ్లపైకి వచ్చి చెత్తా చెదారం రోడ్లపైనే నిలిచిపోయింది. మున్సిపల్ సెంటర్, కబడ్డీ వీధి, నాయీబ్రాహ్మణ కాలనీ, గోలి వారి వీధి, శివాలయం వీధి, మెయిన్‌రోడ్డుతోపాటు పలు మురికి వాడల్లో నీరు నిలిచిపోవడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. మురికివాడల్లో శానిటేషన్ పనులు సక్రమంగా జరగడపోవడం, పలు వార్డుల్లో సరైన రోడ్లు, డ్రెయిన్ నిర్మాణాలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండలంలోని ప్రత్తిపాడు-సామర్లకోట ప్రధాన రహదారిలోని దివిలి జంక్షన్ ప్రవేశంలోనే చెత్తా చెదారం పేరుకుపోవడంతో రోడ్డుపై వర్షపు నీటితో మురుగు కలసి రహదారి జలమయంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు, పాలకులు స్పందించి రోడ్లపై పేరుకు పోతున్న చెత్తకుప్పలు తొలగింపు, రహదారి నిర్మాణాలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.


పెద్దాపురం ఫ్లీడర్స్ వీధిలో నిలిచిపోయిన వర్షపు నీరు


పెద్దాపురం-సామర్లకోట రోడ్డులో ఏరులై పారుతున్న నీరు


పెద్దాపురం నాయీబ్రాహ్మణ కాలనీలో జలమయమైన వీధులు


పిఠాపురం-ఉప్పాడ రోడ్డులో వాకతిప్ప వద్ద నిలిచిన వర్షపు నీరు


కొత్తపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద ఇలా...

క్లుప్తంగా

తాగునీటి కుళాయిల నుంచి బురద నీరు


మున్సిపల్ కుళాయిల నుంచి వచ్చిన తాగునీరు

సామర్లకోట: మున్సిపాలిటీ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందజేయాల్సి ఉండగా గత మూడు రోజులుగా మున్సిపల్ కుళాయిల నుంచి బురద నీరు సరఫరా అవుతుంది. వారం రోజులుగా వర్షాలు కురియడంతో ప్రజలు అనారోగ్యానికి గురి అవుతున్నారు. ఇటు వంటి సమయంలో కుళాయిల నుంచి బురదనీరు ఇవ్వడంపై మానవహక్కుల సంఘ జిల్లా అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ, సీనియర్ కౌన్సిలర్ నేతల హరిబాబులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని వారు ఆరోపించారు. దీనిపై కమిషనర్ ఎ.శ్రీవిద్య మాట్లాడుతూ శనివారం ఫిల్టర్ బెడ్ ప్లాంటును పరిశీలించామని, అక్కడ నీరు స్వచ్ఛంగా ఉందని, పైపులైన్లు లీకవడంతో బురద నీరు వస్తుందని తెలిపారు. ప్రజలందరూ కాచి, చల్లార్చి నీటినే తాగాలని విజ్ఞప్తి చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


వనం-మనం కార్యక్రమంలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే చిన రాజప్ప

పెద్దాపురం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప అన్నారు. వనం-మనం కార్యక్రమంలో భాగంగా శనివారం పెద్దాపురం సత్తెమ్మతల్లి గుడివద్ద ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ పద్మావతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే చిన రాజప్ప మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రతి ఇంటా మొక్కలు నాటాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కాలుష్య నివారణకు వనం-మనం కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని రాజప్ప అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, తూతిక రాజు. కొరుపూరి రాజు, డీఈ ఆదిన్నారాయణ. శానిటరి ఇన్‌స్పెక్టర్ దావీదురాజు తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం పింఛన్ల పంపిణీయే లక్ష్యం

సామర్లకోట: పింఛనుదారులకు అవగాహన కల్పించి మొదటి రోజునే వంద శాతం పింఛన్లు పంపిణీ అయ్యేలా చూడాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక 12వ వార్డు సచివాలయం పరిధిలో 22, 23, 24 వార్డులకు చెందిన లబ్ధిదారులకు శనివారం ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, పెద్దాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కంటే బాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, కౌన్సిలర్లు బలుసు వాసు, సేపెని సురేష్ తదితరులు పాల్గొన్నారు. శనివారం సాయంత్రంకు మున్సిపాలిటీలో 93 శాతం, మండల పరిధిలో 95 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసిన్నట్లు ఆయా శాఖల అధికారులు తెలిపారు. కాగ మండల పరిధిలో హుస్సేన్ పురం గ్రామంలో శనివారం మధ్యాహ్నానికి వంద శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకుడు చల్లా బుజ్జి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

షూటింగ్ చాంపియన్ షిప్ పోటీలో విద్యార్థి ప్రతిభ


బంగారు పతకం సాధించిన విద్యార్థి శ్రీసూర్య ప్రణవ్

కాకినాడ రూరల్: వలసపాకల గ్రామంలోని గంగరాజునగర్ ఆదిత్య ఐఐటీ స్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థి గాదం శ్రీసూర్య ప్రణవ్ 24వ ఏపీ స్టేట్ షూటింగ్ చాంపియన్ షిప్ పోటీలలో ప్రతిభ చూపాడు. పది మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో బంగారు పతకం సాధించాడు. ప్రణవ్ శనివారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో పతకాన్ని అందుకున్నాడు. చాంపియన్ షిప్ పోటీలో ప్రతిభ చూపిన ప్రణవ్ సౌత్ జోన్, ప్రీ నేషనల్స్‌కు ఎంపికై నట్టు కోచ్ సర్పవరం చాంపియన్ షూటింగ్ అకాడమీకి చెందిన పోట్నూరి శంకర్ తెలిపారు.

పని చేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో ఉంచండి

- అజెండాలో రెండోఅంశం వాయిదా
- మున్సిపల్ చైర్‌పర్సన్ అరుణ


సామర్లకోట కౌన్సిల్ సమావేశంలో ప్రజా సమస్యలను వివరిస్తున్న కౌన్సిలర్లు


సభ్యుల ప్రశ్నలకు సమాధానం ఇస్తున్న సామర్లకోట చైర్‌పర్సన్, కమిషనర్లు

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలో పని చేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో ఉంచాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. సమావేశంలో అజెండాలో అంశాలపై చర్చించారు. సచివాలయాల్లో ప్రింటర్ల నిర్వాహణకు నిధులు మంజూరుపై చర్చించి సచివాలయాల్లో ప్రింటర్లను పరిశీలించిన తర్వాతే నిధులు కేటాయిస్తామని, దాంతో అజెండాలోని రెండో అంశం వాయిదా వేస్తున్నట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ తెలిపారు. గత రెండు మూడు నెలలుగా వార్డులో పారిశుధ్య పనుల కోసం ప్రైవేటు కార్మికులను నియమించుకొని పనులు చేయిస్తున్నామని, అది తెలిసి కూడా మున్సిపల్ అధికారులు కొత్త కార్మికులను నియమించకపోవడం మున్సిపాలిటీకి సిగ్గు చేటని కాళ్ల శ్యామల ప్రశ్నించారు. అదేవిధంగా చంద్రశేఖరస్వామి ఆలయం వద్ద కల్వర్టు శిథిలమైన నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదని ఆమె ఆరోపించారు. ఈ కల్వరు నిర్మాణానికి టెండర్లు పిలిచినా ఎందుకు పనులు ప్రారంభించలేదని, పని చేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని సీనియర్ కౌన్సిలర్ ఆవాల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. పనులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఎ.శ్రీవిద్య అన్నారు.

పారిశుధ్య ట్రాక్టర్ల ఆయిల్ విషయంలో నిధుల స్వాహా జరుగుతున్నాయని 30వ వార్డు కౌన్సిలర్ చల్లపల్లి వెంకటసత్యనారాయణ ఆరోపించారు. వార్డులో రోడ్ల నిర్మాణానికి కౌన్సిల్ ఆమోదం పొంది ఏడాది గడిచినా పనులు చేయకపోవడం దారుణమన్నారు. వార్డులో ఉన్న ప్రైవేటు విద్యా సంస్థ పన్నులు బకాయి ఉన్నా ఎందుకు వసూలు చేయడం లేదని ఆరోపించారు. కోర్టు నోటీసు ఇస్తామని ఆర్‌ఐ సురేంద్ర తెలిపారు.14వ వార్డులో కల్వర్టు శిథిలం కావడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్వయంవరపు వీరభద్రరావు ఆరోపించారు. పట్టణంలో మూసివేసిన హాస్టల్ భవనం ఆక్రమణకు గురవుతోందని కౌన్సిల్ సభ్యుడు నేతల హరిబాబు ఆరోపించారు. మున్సిపాలిటీకి మినీ ట్రాక్టర్లు నిరూపయోగంగా ఉన్నాయని, వాటి పక్కకు సెప్టిక్ క్లీనింగ్ ట్యాంకరు చేరే పరిస్థితి ఉందని హరిబాబు ధ్వజమెత్తారు. తాగునీరు, లైటింగ్, శానిటేషన్ అధ్వానంగా ఉన్నదని కౌన్సిలర్లు పిట్టా సత్యనారాయణ, చల్లపల్లి వెంకటసత్యనారాయణ, నేతల హరిబాబు, యార్లగడ్డ జగదీష్, సేపెని సురేష్, నమ్మి దుర్గా భవాని, పెండ్యాల వెంకటలక్ష్మి ఆరోపించారు. గతంలో పని చేసిన చైర్‌పర్సన్ల ఫొటోలు తొలగించడం, జాతీయ నాయకుల చిత్రపటాల పక్కనే ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఫొటోలు ఏర్పాటుపై సభ్యులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి

- వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్
- సంతమార్కెట్ అభివృద్ధికి చర్యలు
- అభివృద్ధి పనులపై అధికారులను నిలదీసిన కౌన్సిల్ సభ్యులు
- వాడీవేడిగా పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం


సమావేశంలో అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్ రాజశేఖర్. సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ తులసీ మంగతాయారు (ఇన్‌సెట్)

పెద్దాపురం: ప్రజా సమస్యలపై దృష్టి సారించాల్సిన అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని మున్సిపల్ కౌన్సిల్ ధ్వజమెత్తింది. పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సర్వ సభ్య సాధారణ సమావేశం శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ మాట్లాడుతూ పట్టణ ప్రజలకు నిత్యం అందుబాటులో శనివారం వారపు సంతతోపాటు సంత మార్కెట్ అభివృద్ధికి కౌన్సిల్ ముందడుగు వేస్తోందన్నారు. త్వరలోనే సంత మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కౌన్సిలర్ త్సలికి సత్యభాస్కర్ మాట్లాడుతూ సంత మార్కెట్ అభివృద్ధితో పాటు మార్కెట్‌ను ఆనుకుని ఉన్న మున్సిపాలిటీకి అప్పగించిన నాలుగు ఎకరాలు ఆర్టీసీ స్థలాన్ని డంపింగ్ యార్డుగా అభివృద్ధి చేయాలన్నారు. కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ మాట్లాడుతూ పెద్దాపురం శతాబ్ది పార్కులో అభివృద్ధి లేక జనం ఇబ్బంది పడుతున్నారన్నారు. మెయిన్‌రోడ్డులో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంపై ఎన్నిసార్లు చెప్పినా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. పట్టణంలో అపారిశుధ్యం, విషజ్వరాలు విజృంభిస్తున్నా శానిటేషన్, ఇంజినీరింగ్ అధికారులు తీరు మారడంలేదని మండిపడ్డారు. కౌన్సిలర్లు పప్పల దుర్గారావు మాట్లాడుతూ పార్కు నిర్వహణ దారుణంగా ఉంది. అయినా మళ్లీ ఆ వ్యక్తికే పార్కు మరమ్మతు పనులు అప్పగించడం దారుణం. కృష్ణబాపూజీ మాట్లాడుతూ పెద్ద వర్కులు చేసే కాంట్రాక్టర్లు సందుల్లో ఉన్న చిన్న సీసీ రోడ్లు నిర్మాణాలపై ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఇంజినీరింగ్ అధికారులను నిలదీశారు. అనంతరం పలు ప్రజా సమస్యలపై వాడీవేడి చర్చ కొనసాగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, వైస్ చైర్మన్ కనకాల మహాలక్ష్మి, డీ ఆదిన్నారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు, కౌన్సిలర్లు విడదాసరి రాజా, ఆరెల్లి వీరాఘవులు, పెంటకోట సత్తిబాబు, కో-ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, షేక్ రఫీ, ఆయా వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో తనిఖీలు


ఎ.మల్లవరం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ భావన

రౌతులపూడి: మండలంలోని ఎ.మల్లవరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ట్రైనీ కలెక్టర్ భావన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న ఆహారం, వంటగది నిర్వహణను ఆమె పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనాలు పెడుతున్నారా ? లేదా ? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల, డార్మెట్రీ, మరుగుదొడ్లను ఆమె పరిశీలించారు. ఎప్పటికప్పుడు మరుగుదొడ్లను శుభ్రం చేయాలని సిబ్బందికి సూచించారు. పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి అలసత్వం వహించరాదన్నారు. పాఠశాల ఆవరణలో అపరిశుభ్రత నెలకొనడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాలలో రికార్డులు, విద్యార్థులు హాజరు శాతం పరిశీలించారు. ఉపాధ్యాయుల పనితీరుపై ప్రిన్సిపాల్ విజయ్‌బాబును ఆరా తీశారు. పాఠశాల నిర్వహణపై నివేదిక తయారు చేసి జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధ్యాపకుడు శ్రీనివాసరావుకు రీసెర్చ్ ఎక్స్‌లెన్స్ అవార్డు

తుని రూరల్: మండలంలోని వి.కొత్తూరు ప్రభుత్వ డిగ్రీ (అటానమస్) కళాశాలలో రసాయన శాస్త్రం అధ్యాపకుడిగా పని చేస్తున్న డాక్టర్ ఎ.శ్రీనివాసరావుకు రీసెర్చ్ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. రసాయన శాస్త్రంపై పరిశోధనలకు గాను ఈ అవార్డు లభించినట్టు శ్రీనివాసరావు శనివారం తెలిపారు. సైంటిఫిక్ ఇంటర్నేషనల్ పబ్లిషింగ్ హౌస్ (తమిళనాడు) ఈ అవార్డును అందించినట్టు ఆయన తెలిపారు. మెమెంటో, సర్టిఫికెట్, మెంబర్ షిప్ కార్డును నిర్వహకులు అందజేశారన్నారు. సైంటిఫిక్ ఇంటర్నేషనల్ పబ్లిషింగ్ హౌస్‌లో జీవిత కాలం మెంబర్‌షిప్ లభించిందన్నారు. రీసెర్చ్ ఎక్సలెన్స్ అవార్డు గ్రహీతను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ లలిత, అధ్యాపకులు అభినందించారు.

శృంగార వల్లభుడికి తుపాను ఎఫెక్ట్

- తగ్గిన భక్తుల రద్దీ
- స్వామి వారికి రూ.97 వేల ఆదాయం


ప్రత్యేక అలంకరణలో తిరుపతి శృంగారవల్లభస్వామి

పెద్దాపురం: స్వయంభూ తిరుపతి శృంగార వల్లభుడి ఆలయానికి తుఫాన్ ప్రభావం తగిలింది. ప్రతి శనివారం వేల మంది భక్తులు స్వామివారి దర్శనానికి వస్తుండేవారు. ఈ వారం ఉదయం నుంచి ఏకధాటిగా కురుస్తున్న వర్షంతో భక్తుల తాకిడి తగ్గింది. సుమారు ఐదువేల మంది మాత్రమే వచ్చారు. ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. స్వామి వారికి ప్రీతికరమైన రోజు కావడంతో అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు స్వామి వారిని పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని వివిధ సేవల టిక్కెట్లు, అన్నదానం, కేశ ఖండన ద్వారా స్వామి వారికి రూ.97,453 ఆదాయం సమకూరినట్లు ఈఓ శ్రీనివాస్ తెలిపారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం


పిఠాపురంలో ఐక్యత చాటుతున్న దళిత నాయకులు

పిఠాపురం: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం చేపట్టాలని పిఠాపురం పట్టణానికి చెందిన దళితులు నిర్ణయించుకున్నారు. స్థానిక రథాలపేట అంబేడ్కర్ భవనంలో శనివారం దళిత నేతలు సమావేశం నిర్వహించారు. అందరూ కలిసి కట్టుగా ఉండి ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నారు. రథాలపేట, ఇందిరానగర్, కత్తులగూడెం, అగ్రహారం, భీమ్‌నగర్ తదితర ప్రాంతాలకు చెందిన దళిత నాయకులు పాల్గొని ఉద్యమ కార్యాచరణపై చర్చించారు. త్వరలో క్షేత్రస్థాయిలో జేఏసీలు ఏర్పాటు చేసి ఉద్యమ కార్యచరణ చేయనున్నట్లు ప్రకటించారు. దళిత నాయకులు వజ్రపు బాబీ, ఉలవల భూషణం, గుబ్బల రాజు, పశ్చిమళ్ల అప్పలరాజు, బోను దేవా తదితరులు పాల్గొన్నారు.

క్రిమినల్ కేసులు పరిష్కరించండి


కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి కమలాదేవి

కాకినాడ లీగల్: ఈనెల 14న జరగబోయే జాతీయ లోక్ అదాలత్ రాజీ పడిన క్రిమినల్ కేసులు ఎక్కువగా పరిష్కరించాలని కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవి అన్నారు. శనివారం మూడో అదనపు జిల్లా జడ్జి కోర్టు హాల్లో పోలీసు అధికారులతో న్యాయమూర్తుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి కమలాదేవి మాట్లాడుతూ అదాలత్‌లో రాజీ పడిన క్రిమినల్ కేసులు పరిష్కరించాలని, ఆ దిశ కక్షిదారులను ప్రోత్సహించాలన్నారు. కక్షిదారులకు కేసు రాజీ వల్ల ప్రయోజనాలను వివరించాలని సూచించారు. ఈ సమావేశంలో న్యాయమూర్తులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు

- జిల్లా రిజిస్ట్రార్ రామలక్ష్మి పట్నాయక్


కోన అప్పారావు దంపతులను సత్కరించిన కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ రామలక్ష్మి పట్నాయక్

కాకినాడ లీగల్: విధి నిర్వహణలో అంకితభావంతో పని చేస్తేనే మంచి గుర్తింపు లభిస్తుందని కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ పి.రామలక్ష్మి పట్నాయక్ శనివారం పేర్కొన్నారు. కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో సబార్డినేట్‌గా పనిచేస్తున్న కోన అప్పారావు పదవీ విరమణ సందర్భంగా సన్మాన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రిజిస్ట్రార్ పి.రామలక్ష్మి పట్నాయక్ మాట్లాడుతూ అప్పారావు 42 సంవత్సరాలు సబార్డినేట్‌గా విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయడమే కాకుండా ఆఫీసు కార్యకలాపాలను కూడా ఎంతో చక్కగా నిర్వహించారన్నారు. కాకినాడ జాయింట్ సబ్‌రిజిస్ట్రార్-1 టి.ప్రసాద రెడ్డి మాట్లాడుతూ అప్పారావు రిజిస్ట్రేషన్ శాఖలో ఎటువంటి ఆరోపణలు లేకుండా ప్రతి అంశంపై అవగాహన ఉండడంతో ఏ పని అయినా చక్కగా నిర్వర్తించేవారన్నారు. సన్మాన గ్రహీత అప్పారావు మాట్లాడుతూ రాష్ట్ర ఐజీ కార్యాలయంలో 1981లో సబార్డినేట్‌గా జాయిన్ అయ్యాను. అనంతరం డీఐజీ, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో పాటు సబ్ రిజిస్ట్రార్ల కార్యాలయంలో విధి నిర్వహణలో మంచి గుర్తింపు పొందడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అప్పారావు దంపతులను కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ పి.రామలక్ష్మి పట్నాయక్, కాకినాడ జాయింట్ సబ్‌రిజిస్ట్రార్1-2 టి.ప్రసాదరెడ్డి, రమ్యశ్రీ, రిజిస్ట్రేషన్ శాఖ, ఉద్యోగులు పూలమాలలు, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు.